సాక్షి సిద్దిపేట
మంగళవారం । 18 । మార్చి । 2025



తీపి తగ్గ లేదు..

నష్టం ఉండదనే నమ్మకంతో అధిక శాతం మంది రైతులు చెరకు సాగు చేస్తున్నారు.


వివరాలు 8లో ▸



కేసుకు కారకుడయ్యాడని..

కేసుకు కారకుడయ్యాడన్న కోపంతో తోటి మిత్రులే యువకుడిని కొట్టి హత్య చేశారు.

వివరాలు 8లో ▸



న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ డీఎం

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్(జీపీపీ) ఆర్టీసీ డిపో పరిధిలో మంగళవారం 'డయల్ యువర్ డీఎం' నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో బస్సులలో రాకపోకలు సాగించే ప్రయాణికులకు సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని జీపీపీ ఆర్టీసీ డిపో మేనేజర్ పవన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల సమస్యలు తెలుసుకోవడంతో పాటు వాటిని పరిష్కరించేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు 99592 26270 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు, సూచనలు తెలపాలన్నారు.

నాచగిరి హుండీ ఆదాయం రూ.15.42 లక్షలు



హుండీ కానుకల లెక్కింపును పర్యవేక్షిస్తున్న అధికారులు

వర్గల్(గజ్వేల్): నాచగిరి లక్ష్మీనృసింహ క్షేత్రంలో సోమవారం హుండీ కానుకలు లెక్కించారు. గడచిన 88 రోజులలో భక్తులు వేసిన కానుకల ద్వారా ఆలయానికి రూ.15,42,922 ఆదాయం సమకూరినట్లు కార్యనిర్వహణాధికారి విశ్వనాథశర్మ తెలిపారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి పర్యవేక్షణలో హుండీలను తెరిచారు. హైదరాబాద్ భ్రమరాంబిక సేవాసమితి సభ్యులు, శివకేశవ స్వచ్ఛంద సంస్థ సభ్యులు, ఆలయసిబ్బంది హుండీ కానుకల లెక్కింపులో పాల్గొన్నారు.

వర్గీకరణ తర్వాతే నియామకాలు చేపట్టాలి

ఎమ్మార్పీఎస్ నిరసన దీక్షలు ప్రారంభం



దీక్షలో కూర్చున్న నాయకులు

గజ్వేల్: ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాతే గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–3 ఉద్యోగాల నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గజ్వేల్‌లో నిరసన దీక్షలను ప్రారంభించారు. ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉబ్బని ఆంజనేయులు మాదిగ అధ్వర్యంలో ఈ దీక్షలు చేపట్టారు. ఎంఈఎఫ్(మాదిగ ఉద్యోగుల సమాఖ్య) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేబర్తి యాదగిరిమాదిగ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ ప్రక్రియ పూర్తయ్యేవరకు ఉద్యోగాల నియామకాలను ఆపేయాల్సిందేనని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహాజన సోషలిస్టు పార్టీ(ఎంఎస్‌పీ) రాష్ట్ర నాయకులు మైస రాములు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బుడిగే మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు రహిత సమాజాన్ని నిర్మిద్దాం

డీఎంహెచ్‌ఓ డాక్టర్ పల్వన్‌కుమార్



మాట్లాడుతున్న పల్వన్‌కుమార్

సిద్దిపేటకమాన్: కుష్ఠు రహిత సమాజాన్ని నిర్మించేందుకు జిల్లాలో సోమవారం నుంచి ఈ నెల 30వరకు క్షేత్రస్థాయిలో ఆశాకార్యకర్తల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ పల్వన్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి వ్యాధి లక్షణాలు ఉన్న వారిని ముందస్తుగా గుర్తించి చికిత్స అందిస్తామన్నారు. కుష్ఠు వ్యాధిపై ప్రజలలో ఉన్న అపోహలను తొలగించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో 882 టీంల ద్వారా సర్వే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. వైద్య సిబ్బంది గృహ సందర్శనకు వచ్చినపుడు ప్రజలు సహకరించాలన్నారు.

బీజేపీతోనే బీసీల అభివృద్ధి

జగదేవ్‌పూర్(గజ్వేల్): బీజేపీతోనే దేశంలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ అన్నారు. సోమవారం గొల్ల, కురుమ సంఘం ఆధ్వర్యంలో కొండపోచమ్మ ఆలయ అవరణలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సన్మానం కార్యక్రమం నిర్వహించారు. నూతనంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయనను సంఘం నేతలు సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు ఐలయ్యయాదవ్, నాయకులు భాస్కర్, రాజు, నర్సింహులు, రమేశ్ పాల్గొన్నారు.

పొట్ట దశలో పుట్టెడు కష్టాలు



పక్క చిత్రంలో రైతు పేరు శతవేణి కొమురయ్య.. కోహెడ మండలం రామచంద్రాపూర్‌కు చెందిన ఈ రైతు.. మోయతుమ్మెద వాగు శివారులో మూడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్నారు. వరి సాగు చేశాడు. పంట పొట్ట దశలో ఉండగా.. నీరందక పొలం ఎండిపోయింది. ఇప్పటికే పంట కోసం రూ.80వేల వరకు పెట్టుబడి పెట్టారు. పంట ఎండిపోవడంతో తీవ్రంగా నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఒక్క రైతు పరిస్థితే కాదు జిల్లాలో పంటలు సాగు చేస్తున్న దాదాపు అందరిదీ ఇదే దుస్థితి.

సాక్షి, సిద్దిపేట: జిల్లాలో గత అక్టోబర్ వరకు వర్షాలు కురిశాయి. దీంతో యాసంగిలో వరి సాగుకు ఏమాత్రం ఢోకా లేదని భావించారు. చెరువులు, వాగులు, బోరుబావులపై ఆధారపడి.. ఎక్కువ మంది రైతులు వరి సాగుకే మొగ్గు చూపారు. వారందరూ ప్రస్తుతం ఇబ్బంది పడుతున్నారు. పెరుగుతున్న ఎండలకు బోరుబావుల్లో భూగర్భజలాలు అడుగంటాయి. కొత్త బోర్లు వేసినా.. ఫలితం కానరావడంలేదు. పొట్టదశలో ఉన్న వరి పైరును కాపాడుకోలేని నిస్సహాయస్థితిలో జీవాలకు మేతగా వదిలేస్తున్నారు. వరి, మొక్కజొన్న పంటల పరిస్థితి చూసి, జిల్లా రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

మరో నెల రోజుల్లో చేతికి..

మరో నెల నుంచి నెలన్నర రోజుల్లో చేతికి వచ్చే పంటలు ఎండిపోతున్నాయి. కొన్ని చోట్ల వరి పొలాలను రైతులు అర్ధంతరంగా వదిలేస్తున్నారు. మరికొందరు కొత్త బోర్లను తవ్వుతున్నా.. నీటి జాడ అందడంలేదు. కొందరు ట్యాంకర్లతో నీటి తడులందిస్తూ పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎండిపోయిన పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించి రైతులకు సూచనలిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 3.50లక్షల ఎకరాల్లో సాగవుతుండగా వ్యవసాయ అధికారుల లెక్కల ప్రకారం 2,094 ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. జిల్లాలో సగటున భూగర్భ జలాలు 12.13మీటర్ల లోతుకు పడిపోయాయి.

నీరందక పంట పొలాలన్నీ నెర్రలు

- ఇప్పటికే 2వేల ఎకరాలకుపైగా ఎండిన పంటలు
- మండుతున్న ఎండలతో అడుగంటుతున్న భూగర్భ జలాలు
- చేసేదిలేక జీవాలకు మేతగా పంట చేన్లు
- ఆదుకోవాలని కోరుతున్న రైతులు



చేర్యాల మండలం వేచరేణిలో ఎండిపోయిన పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

వ్యవసాయ అధికారుల సర్వే ప్రకారం వివరాలు..

మండలం	ఎండిపోయిన ఎకరాలు
చేర్యాల	300
కొమురవెల్లి	350
దూళ్మిట్ట	15
మద్దూరు	15
దుబ్బాక	168
కొండపాక	190
అక్కన్నపేట	305
కోహెడ	152
జగదేవ్‌పూర్	58
హుస్నాబాద్	91
సిద్దిపేట అర్బన్	45
తొగుట	48
సిద్దిపేట రూరల్	50
మిరుదొడ్డి	77
దౌల్తాబాద్	25
బెజ్జంకి	45
రాయపోల్	40
చిన్నకోడూరు	20
అక్బర్‌పేట భూంపల్లి	90

తాగునీటికీ తండ్లాటే

- లకుడారంలో నీటి గోస
- ట్యాంకర్ ద్వారా సరఫరా
- బిందెడు నీటి కోసం పిల్లాపాపలతో క్యూ



ట్యాంకర్ ద్వారా సరఫరా చేసే నీటి కోసం ప్రజల తిప్పలు

కొండపాక(గజ్వేల్): గ్రామాల్లో తాగునీటికీ తండ్లాట తప్పడంలేదు. మిషన్ భగీరథ పథకం మంచి నీటి సరఫరాను పట్టించుకునేవారేలేరు. దీంతో ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కుకునూరుపల్లి మండలం లకుడారంలో సుమారు 1800 జనాభా ఉంటుంది. కోమటి బండ నుంచి గ్రామానికి భగీరథ పథకం నుంచి నీరు సరఫరా చేసేవారు. ఈక్రమంలో గ్రామానికి నీటి సరఫరా అయ్యే పైపులైన్ దెబ్బతిన్నది. పది రోజలవుతున్నా మరమ్మతుకు నోచుకోవడంలేదు. దీంతో గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా ఒక్కసారే సరఫరా చేస్తుండటంతో స్థానికులు పిల్లపాపలతో క్యూ కట్టాల్సి వస్తోంది. వ్యవసాయ బోరుబావుల నుంచి తెచ్చుకుందామన్నా ఎండాకాలం కావడంతో రైతులు అడ్డుచెబుతున్నారు. అధికారులు స్పందించి భగీరథా పథకం ద్వారా తాగు నీరు సరఫరా అయ్యేలా చూడాలని కోరుతున్నారు. ఈవిషయమై గ్రిడ్ ఏఈ వెంకటేశ్‌ను వివరణ కోరగా కోమటిబండ వద్ద నీటి కొరత ఏర్పడటంతో నీటి సమస్య ఏర్పడిందన్నారు. రెండు మూడు రోజుల్లో నీరు సరఫరా అయ్యేలా చూస్తామన్నారు.

రోడ్డెక్కిన రైతులు



రైతులతో మాట్లాడుతున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాకటౌన్: తలాపునే గోదావరి నీళ్లు ప్రవహిస్తున్నప్పటికీ నీరు అందక పంటలు ఎండుతున్నాయని రైతులు మండిపడ్డారు. చేగుంట, దౌల్తాబాద్ మండలాల రైతులు దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ చౌరస్తాలో సోమవారం రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. దీంతో రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాలు స్తంభించాయి. దౌల్తాబాద్ మండలం మాచిన్ పల్లి, నర్సంపల్లి, చేగుంట మండలం పోతన్‌పల్లి, పోతంశెట్టిపల్లి, మక్కరాజుపేట, చందాయిపేట, కాసాన్‌పల్లి, తదితర గ్రామాలకు చెందిన సుమారు 500 మంది రైతులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. సాగునీరు అందించి పంటలను కాపాడాలని రైతులు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న దుబ్బాక కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అక్కడికివచ్చి వారితో మాట్లాడారు. సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రైతుల ధర్నాను విరమింప జేశారు. కార్యక్రమంలో దౌల్తాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాములు, ఉపాధ్యక్షుడు స్వామి, ఇరిగేషన్ అధికారులు తదితరులున్నారు.

పంటలు కాపాడాలంటూ ఆందోళన



దుబ్బాకలో ఆందోళన చేస్తున్న రైతులు

దుబ్బాక: మల్లన్నసాగర్ కాలువ ద్వారా నీటిని అందించి ఎండుతున్న పంటలు కాపాడాలని సోమవారం దుబ్బాకలో రైతులు ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ దుబ్బాకకు కన్నతల్లి లాంటి పెద్దచెరువులోకి మల్లన్నసాగర్ నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకు కాల్వ పూర్తి చేయకపోవడం దారుణమన్నారు. పెద్దచెరువును నింపితే 1500 ఎకరాలకు పైగా పంటలు సాగులోకి వస్తాయన్నారు. వెంటనే ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ రఘునందన్‌రావు స్పందించి చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రైతులు రాజమల్లు, రాంచంద్రం, జోగయ్య, యాదగిరి, రాజయ్య, బాబు, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

అన్నదాతలను పట్టించుకోని సర్కార్



గుండారంలో ఎండిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న రసమయి బాలకిషన్

బెజ్జంకి(సిద్దిపేట): సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని గుండారంలో మంగళవారం ఆయన ఎండిన వరి పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. కాలువల ద్వారా సాగు నీటిని అందించడంలోనూ, రైతుల సమస్యలు పట్టించుకోవడంలోనూ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎండిన పంటలకు ఎకరాకు రూ.20వేల పరిహారమిచ్చి రైతులను ఆదుకోవాలని కోరారు.

రిజర్వాయర్ పంప్‌హౌస్ వద్ద ధర్నా



పంప్‌హౌస్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

మద్దూరు(హుస్నాబాద్): లద్నూరు రిజర్వాయర్‌లోకి సాగునీరు విడుదల చేయాలని రైతులు బొమ్మకూరు రిజర్వాయర్ పంప్‌హౌస్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ మేరకు గ్రామ మాజీ ఎంపీటీసీ గుజ్జుక సమ్మయ్య మాజీ సర్పంచ్ జీడికంటి సుదర్శన్‌లు రైతులతో కలిసి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న రిజర్వాయర్‌లోకి సాగునీరు విడుదల చేయకపోవడంతో పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బావులు, బోర్లు వట్టిపోవడంతో పంటలకు నీరు అందడంలేదన్నారు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నామని అన్నారు. ఇప్పటికైనా రిజర్వాయర్‌లోకి నీటిని విడుదల చేయాలన్నారు.

లక్ష్యంతో చదివితేనే ఉన్నత స్థాయికి..

ఎంపీ రఘునందన్ రావు



టెన్త్ ఎగ్జామినేషన్ కిట్ అందజేస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

మిరుదొడ్డి(దుబ్బాక): ఒక నిర్దిష్టమైన లక్ష్యంతో చదివితేనే ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరుకుంటారని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. సంకల్ప్ సేవా ఫౌండేషన్, ఎస్ఆర్‌కే ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం మిరుదొడ్డి మండల పరిధిలో టెన్త్ విద్యార్థులకు ఎగ్జామినేషన్ కిట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అత్యున్నతమైన గౌరవం, విలువ లభించాలంటే చదువొక్కటే మార్గమన్నారు. అనుకున్నది సాధించాలంటే పట్టుదలతో చదివి మంచి ఫలితాలను సాధించాలన్నారు.

ఉపాధ్యాయులపై అసహనం ..

ఎగ్జామినేషన్ కిట్స్ పంపిణీ కార్యక్రమంలో దేశ రాష్ట్రపతి ఎవరు అన్న ప్రశ్నకు విద్యార్థులు సరైన సమాధానం చెప్పకపోవడంతో మెదక్ ఎంపీ విస్మయం వ్యక్తం చేశారు. దేశ ప్రథమ పౌరురాలు ఎవరో తెలియని విద్యార్థులకు ఏం విద్యాబోధన చేస్తున్నారని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. ప్రతి పాఠశాలలో ప్రధాని, రాష్ట్రపతి, రాష్ట్ర సీఎం ఫొటోలను ఏర్పాటు చేయాలని ఎంఈఓ ప్రవీణ్ బాబును ఆదేశించారు. ఇదిలా ఉండగా ఎంపీగా గెలుపొందిన తర్వాత తొలి సారిగా మిరుదొడ్డి మండల కేంద్రానికి వచ్చిన మెదక్ ఎంపీ మాధ వనేని రఘునందన్ రావుకు పలువురు రైతులు, అంగన్‌వాడీ టీచర్లు వినతులు అందజేశారు. వినతులను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌కే వ్యవస్థాపకుడు శివరామ కృష్ణ, దక్షిణ మధ్య ధర్మ జాగరణ ప్రముఖ్ అమర లింగం, ఎంఈఓ ప్రవీణ్ బాబు పాల్గొన్నారు.

అదనపు పీపీగా ఆత్మారాములు



ఆత్మారాములును సన్మానిస్తున్న హరికృష్ణ తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఆత్మారాములును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మూడేళ్ల పాటు ఆత్మారాములు విధులు నిర్వహించనున్నారు. ఆయన మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పగించిన విధులను సక్రమంగా నిర్వహిస్తానని అన్నారు. ఈ సందర్భంగా ఆత్మారాములును కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఎండీ రఫీయోద్దీన్, డీసీసీ లీగల్ సెల్ అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు సత్వరం పరిష్కరించండి

కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి

సిద్దిపేటరూరల్: ప్రజావాణిలో అందించిన అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, అబ్దుల్ హమీద్ లతో కలిసి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. పలు సమస్యల పరిష్కారం కోరుతూ మొత్తం 43 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో డీఆర్‌ఓ నాగరాజమ్మ, డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్యా అధికారులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేయించండి

సిద్దిపేటరూరల్: జిల్లా వ్యాప్తంగా 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకునేలా చూడాలని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన వారందరినీ ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలన్నారు.

సంక్షేమ హాస్టళ్లను పట్టించుకోండి

- విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా పట్టించుకోవడంలేదు..
- అసెంబ్లీలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

దుబ్బాక: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల అధ్వానంగా మారాయని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సోమవారం అసెంబ్లీ సమావేశంలో ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే దృష్టిసారించాలన్నారు. హాస్టళ్ల నిర్వహ ణ కొరవడటం.. నాణ్యమైన భోజనం అందడటంలేదన్నారు. కొందరు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా అర్థం చేసుకోవాలన్నారు. హబ్షీపూర్ గురుకులంలో 7 వ తరగతి విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి నీలోఫర్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారన్నారు. విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినా విషయం బయటకు రానివ్వడంలేదన్నారు. ఏ హాస్టల్‌కు వెళ్లినా ఫుడ్‌పాయిజన్, సిబ్బంది సక్రమంగా ఉండక సౌకర్యాలు సరిగ్గా లేక అవస్థలు పడుతున్నారన్నారు.

కూడవెల్లి వాగులోకి మల్లన్నసాగర్ జలాలు

దుబ్బాక: కూడవెల్లి వాగులోకి మల్లన్నసాగర్ నీటిని విడుదల చేయడంపై సోమవారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే 'సాక్షి'తో మాట్లాడారు. రైతుల కష్టాలను తెలుసుకున్న మంత్రి.. వెంటనే స్పందించి మల్లన్నసాగర్ నీటిని కూడవెల్లి వాగులోకి వదలాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారన్నారు. కూడవెల్లి వాగులోకి 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారన్నారు. చిన్నశంకరంపేట, రామయంపేట కాలువలకు నీటి సరఫరా పెంచాలని సైతం ఆదేశించారన్నారు.

విద్యార్థుల వినూత్న స్వాగతం



భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్ అంతరిక్షం నుంచి బయలుదేరి వస్తున్న క్రమంలో అంబిటస్ విద్యార్థులు సోమవారం వినూత్న రీతిలో స్వాగతం పలికారు. పాఠశాల మైదానంలో సునీతా వెల్ కమ్ టూ ఎర్త్ అనే అక్షర రూపంలో కూర్చుని స్వాగతం పలికారు. అంతరిక్షనౌకలో సాంకేతిక సమస్య వల్ల సుమారు 9 నెలల పాటు అక్కడే ఉండి, అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం భూమిపై అడుగు పెట్టనున్నారు.

– సిద్దిపేటజోన్

క్లుప్తంగా

అగ్నివీర్ నియామకాలకు దరఖాస్తు చేసుకోవాలి

డీఐఈఓ రవీందర్‌రెడ్డి

సిద్దిపేట ఎడ్యుకేషన్: అగ్నివీర్ నియామకాలకు జిల్లాలో అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి(డీఐఈఓ) రవీందర్‌రెడ్డి కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ..రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని, ఏప్రిల్ 10 వరకు కొనసాగనున్నట్లు తెలిపారు. జనరల్, టెక్నికల్, క్లర్క్, స్టోర్ కీపర్, ట్రేడ్‌మెన్ తదితర విభాగాల్లో నియామకాలు ఉంటాయన్నారు. జనరల్ విభాగానికి 10వ తరగతి 45 శాతం మార్కులతో, టెక్నికల్‌కు ఇంటర్ ఎంపీసీ 50 శాతం మార్కులతో, క్లర్క్ విభాగానికి ఇంటర్మీడియట్ 60 శాతం మార్కులతో, ట్రేడ్‌మెన్‌కు 10వ తరగతి 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. 17.5 ఏళ్ల నుంచి 21 ఏళ్ల మధ్య ఉండి అవివాహిత పురుష అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని వివరించారు. నియామక ప్రక్రియ రెండు దశల్లో ఉంటుందని మొదటిది 200ల మార్కులకు కామన్ ఎంట్రెన్స్ పరీక్ష, రెండవ దశలో రన్నింగ్, శారీరక దృఢత్వ పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. రూ.250 పరీక్ష రుసుం చెల్లించి సంబంధిత అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, పరీక్ష జూన్ నెలలో ఉంటుందన్నారు. నియామకాలు పూర్తిగా మెరిట్‌పైనే ఆధారపడి ఉంటాయన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్‌ల జోలికి వెళ్లొద్దు

సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: ఆన్‌లైన్ బెట్టింగ్ జోలికి వెళ్లకూడదని, గేమింగ్‌కి అలవాటు పడి యువత ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని సిద్దిపేట సీపీ అనురాధ తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. బెట్టింగ్‌లపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సోషల్ మీడియా వేదికగా ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్స్‌లను ప్రమోట్ చేసే వారి సమాచారం అందించాలన్నారు. మోసపూరిత ప్రకటనలు, మేసేజ్‌లకు వ్యక్తిగత, ఓటీపీ వివరాలు పంపకూడదన్నారు. ఇలాంటి కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే డయల్ 100కు తెలపాలన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యంతో అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సోమవారం రెవెన్యూ, పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. ఆర్ఐ యాదగిరి కథనం మేరకు.. నమ్మదగిన సమాచారం మేరకు చిగురుమామిడి మండలం కొండాపూర్‌కు చెందిన బత్తుల అంకుష్ వద్ద దాదాపు 7 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నాం. గ్రామంలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా సేకరించి ఓ ప్రైవేట్ ఇంట్లో నిల్వ ఉంచారు. రేషన్ బియ్యాన్ని పట్టుకొని సివిల్ సప్లయ్ గోదాముకు తరలించాం. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయ్‌భాస్కర్ తెలిపారు.

హత్య కేసులో నిందితురాలి అరెస్ట్

సంగారెడ్డి క్రైమ్ : యువకుడి హత్య కేసులో నిందితురాలైన గడ్డం మరియమ్మను పోలీసుల ఆదివారం రాత్రి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ రమేశ్ కథనం మేరకు.. 15న మన్నే వినోద్ (21) అనే యువకుడితో డబ్బుల విషయంలో గొడవ జరుగగా ఆగ్రహించిన మరియమ్మ రాయితో కొట్టి దారుణంగా హత్య చేసింది. ఈ కేసు భాగంగా నిందితురాలిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

నీటి సంపులో పడి వ్యక్తి మృతి

ములుగు(గజ్వేల్):నీటి సంపులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన ములుగు మండలం వంటిమామిడి సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు.. తానెదార్‌పల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన జామకాయల నర్సింలు(40) చిత్తు కాగితాలు ఏరుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. భార్య సబిత, ఇద్దరు కుమారులున్నారు. నర్సింలు 2 నెలల కిందట అగుపించకుండా పోవడంతో కుటుంబీకుల ఫిర్యాదు ములుగు పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. వంటిమామిడి రాజీవ్‌రహదారి పక్కన నిర్మాణంలో ఉన్న ఓ పరిశ్రమ నీటి సంపులో సోమవారం నర్సింలు మృతదేహం లభ్యమైంది. మృతదేహం కుళ్లిపోయి ఉండటంతో ఘటనా స్థలంలోనే వైద్యులతో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

తీపి తగ్గ లేదు..

- చెరకు సాగుపై రైతులకు పెరుగుతున్న ఆసక్తి
- జహీరాబాద్ నియోజకవర్గంలో కొనసాగుతున్న ప్లాంటేషన్
- ఇప్పటి వరకు 3.50 లక్షల టన్నులు
- కొత్త కర్మాగారం ఏర్పాటు, ఫ్రీ జోన్ ప్రకటన
- పంట సరఫరాకు తొలగిన అడ్డంకులు



జహీరాబాద్ ప్రాంతంలో కొత్తగా ప్లాంటేషన్ చేసిన చెరకు పంట

న్యాల్‌కల్ మండలంలోని హద్నూర్ గ్రామ రైతు ఈదుల్‌పల్లి నాగన్న గతేడాది 4 ఎకరాల్లో చెరకు పంట పండించాడు. ఈసారి మరో రెండు ఎకరాలు అదనంగా ప్లాంటేషన్ చేశాడు. ప్రస్తుతం 6 ఎకరాల్లో చెరకు తోట ఉంది. అదే గ్రామానికి చెందిన రవీందర్‌కు రెండు ఎకరాల చెరకు పంట ఉండగా ఈ ఏడాది మరో ఎకరంలో వేశాడు. ఇలా జహీరాబాద్ నియోజకవర్గంలోని చాలా మంది రైతులు చెరకు పంటపై ఆసక్తి చూపుతున్నారు. చెరకు వల్ల పెద్దగా నష్టం రాదన్న నమ్మకంతో అధిక శాతం మంది రైతులు సాగు చేస్తున్నారు.

– జహీరాబాద్ టౌన్

జహీరాబాద్ ప్రాంత నేలలు చెరకు, అల్లం, ఆలుతో పాటు కంది, సోయాబిన్, పత్తి, పెసర, మొక్కజొన్న,శనగ పంటలకు అనుకూలం. నీటి వనరులు లేనందున బోరుబావులపై ఆధారపడి పంటలను పండిస్తుంటారు. ముఖ్యంగా రైతులు చెరకు సాగు వైపు మొగ్గు చూపుతారు. ఎకరం పొలం కలిగిన రైతు కూడా బోరు వేసుకొని చెరకు పండిస్తుంటారు. స్థానికంగా ట్రైడెంట్ చక్కెర కర్మాగారం ఉండటంతో చెరకు పంటను వేస్తున్నారు. పలు కారణాలతో రెండేళ్ల నుంచి ట్రై డెంట్ కర్మాగారంలో క్రషింగ్ నిలిచిపోవడంతో రైతులు కొంత ఆందోళన చెందారు. పంటను ఎక్కడికి సరఫరా చేయాలన్న భయం వారిలో నెలకొంది. జిల్లా షుగర్‌కేన్ అధికారులు రంగప్రవేశం చేసి ట్రైడెంట్ జోన్‌ను ఫ్రీజోన్‌గా ప్రకటించారు. ఇక్కడ పండించిన పంటను ఎక్కడికైనా అమ్ముకోవచ్చని చెప్పారు. అదే సమయంలో రాయికోడ్ మండలంలో కొత్తగా కర్మాగారం ఏర్పాటు కావడంతో ఊరట లభించింది. 2024–25 సీజన్‌లో కర్మాగారంలో క్రషింగ్ విజయవంతం పూర్తి చేయడంతో రైతుల్లో ఆత్మస్థైర్యం పెరిగింది.

సుమారు 10 వేల మంది రైతులు

జహీరాబాద్ ప్రాంతంలో సుమారు 10 వేల మంది రైతులు దాదాపు 20 వేల ఎకరాల్లో ప్రతీ సంవత్సరం చెరకు పంటను సాగు చేస్తుంటారు. సుమారు 5 లక్షల టన్నుల వరకు చెరకు పంట పండిస్తుంటారు. ట్రైడెంట్‌లో క్రషింగ్ జరగనందున గతేడాది సుమారు 3 లక్షల టన్నులకు పడిపోయింది. జహీరాబాద్‌ను ఫ్రీజోన్‌గా ప్రకటించడంతో పంట మొత్తం ఇతర మిల్లులకు తరలించడంతో పొలాలన్నీ ఖాళీ అయ్యాయి. రైతులకు భరోసా కల్గడంతో ఈ సంవత్సరం పంట విస్తీర్ణం పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.ప్లాంటేషన్ చేసినట్లు తెలిసింది.

చెరకు నష్టం కల్గించదు



చెరకు పంట ద్వారా లాభం తగ్గిన నష్టం మాత్రం రాదు. అందుకని వర్షాలు పడ్డా పడకపోయినా.. గిట్టుబాటు ధర ఉన్నా లేకపోయినా ప్రతీ సంవత్సరం పంట వేస్తాం. గతేడాది నాలుగు ఎకరాల్లో పంట వేశాను. పెట్టుబడులు పోగా లాభం వచ్చింది. ట్రైడెంట్‌లో క్రషింగ్ ఆడకపోయినా బ్రోకర్లు పంటను కొని టన్నుకు రూ. 2,600 వేలు ఇచ్చారు. అందుకని ఈ సంవత్సరం అదనంగా రెండు ఎకరాల్లో చెరకు ప్లాంటేషన్ చేశా.

–వీరన్న పాటిల్, రైతు దిడ్గి, జహీరాబాద్

జూన్ నెలాఖరు వరకు ప్లాంటేషన్ కొనసాగుతుందని, సాగు విస్తీర్ణం పెరుగనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

కర్నాటక, మహారాష్ట్రలోని మిల్లులకు తరలింపు

రెండేళ్ల నుంచి స్థానిక ట్రైడెంట్ కర్మాగారం బంద్ ఉండటంతో పంట సరఫరా కోసం రైతులు నానా అవస్థలు పడ్డారు. 2024–25 సీజన్‌లో రాయికోడ్ మండలంలోని మాటూర్ ప్రాంతంలో కొత్తగా నిర్మించిన గోదావరి–గంగా కర్మాగారంలో పూర్తి స్థాయిలో క్రషింగ్ జరిగింది. గోదావరి–గంగాతో పాటు పొరుగున ఉన్న సంగారెడ్డి గణేశ్ షుగర్స్, కామారెడ్డి గాయత్రీ, కొత్తకోట కృష్ణవేణితో పాటు పక్కనున్న కర్నాటక, మహారాష్ట్రలోని మిల్లులకు రైతులు పంటను తరలించారు. పొలాల్లోని పంట మొత్తం ఖాళీ అవడంతో కొత్తగా ప్లాంటేషన్‌పై ఆసక్తి చూపుతున్నారు.

కేసుకు కారకుడయ్యాడని కొట్టి చంపారు

- వీడిన యువకుడి హత్య కేసు మిస్టరీ
- ముగ్గురు నిందితుల రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజశేఖర్ రెడ్డి

పాపన్నపేట(మెదక్): డ్రంకెన్ డ్రైవ్ కేసుకు కారకుడయ్యాడన్న కోపంతో తోటి మిత్రులే యువకుడిని కొట్టి హత్య చేశారని మెదక్ రూరల్ సీఐ జీ.రాజశేఖర్ రెడ్డి, పాపన్నపేట ఎస్సై సార శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. 10న ఏడుపాయల వద్ద వెలుగు చూసిన హత్యకేసును పోలీసులు ఛేదించి సోమవారం వివరాలు వెల్లడించారు. పాపన్నపేట మండలం రామతీర్థం గ్రామానికి చెందిన వడ్ల నవీన్ సంగారెడ్డిలోని ఓ బేవరేజ్ కంపెనీలో పని చేసే సమయంలో తొగర్‌పల్లికి చెందిన వినోద్ రెడ్డి, సంగారెడ్డికి చెందిన బేగరి రాములు, కుమ్మరి రమణాచారి స్నేహితులయ్యారు. సంగారెడ్డిలో గత నెల 18న నలుగురు స్నేహితులు మద్యం సేవించి వెళ్తుండగా పోలీసుల డ్రంకెన్ డ్రైవ్ టెస్టులో దొరికారు. నవీన్ పోలీసులను బతిమాలుతుండగా, వినోద్ రెడ్డి వారితో దురుసుగా ప్రవర్తించారు. దీంతో పోలీసు లు కేసు నమోదు చేశారు. కోర్టు జరిమానా, ఇతర ఖర్చులను నవీన్ భరించాడు. అప్పటి నుంచి వినోద్‌రెడ్డిపై మిత్రులు కక్ష పెంచుకున్నారు. ముందస్తు ప్లాన్ ప్రకారం ఈనెల 8న ముగ్గురూ కలిసి వినోద్ రెడ్డిని తీసుకొని ఏడుపాయల్లో దావత్ చేసుకుందామని తీసుకెళ్లారు. ఏడుపాయల్లో మందు కొనుగోలు చేసి మునిపుట్ట వద్ద తాగారు. అప్పటికే కోపంతో ఉన్న నవీన్ కట్టెతో వినోద్ రెడ్డిపై దాడి చేశాడు. అతడితో పాటు బేగరి రాములు, కమ్మరి రమణాచారి విచక్షణారహితంగా కొట్టడంతో చనిపోయాడు. అనంతరం నిందితులు నవీన్ ఇంటికొచ్చి డబ్బులు తీసుకొని పారిపోయారు. మృతుడి సోదరుడు విష్ణువర్ధన్ రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈనెల 8న సంగారెడ్డిలో నలుగురూ కలిసి ఉన్న విషయాన్ని తెలుసుకున్నారు. కొంత మంది సాక్షు లు ఇచ్చిన సమాచారం మేరకు నిందితులని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, డీఎస్పీ ప్రసన్న కుమార్ పోలీసులను అభినందించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

వటపల్లి(అందోల్): తాళం వేసిన ఇంట్లో దొంగ చోరీకి పాల్పడిన ఘటన అందోలు మండల పరిధిలోని ఎర్రారం గ్రామంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. జోగిపేట సీఐ అనిల్‌కుమార్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన శేషారెడ్డి ఫిబ్రవరి 7న కూతురికి ఆరోగ్యం బాగా లేదని కుటుంబంతో కలిసి ఇంద్రేశంకు వెళ్లి బంధువుల వద్ద ఉండి వారం రోజుల తర్వాత 14న రాత్రి ఎర్రారం గ్రామానికి చేరుకున్నాడు. ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా ఇంట్లోని 25 తులాల బంగారు ఆభరణాలు, రూ.1.60 లక్షల నగదు కనిపించలేదు. ఇంట్లో దొంగలు పడ్డారని జోగిపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ నేతృత్వంలో పోలీసులు విచారణ చేపట్టి అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారణ జరిపారు. శేషారెడ్డి ఇంటి సమీపంలో ఉండే బాయికాడి శ్రీశైలం దొంగతనానికి పాల్పడినట్లుగా గుర్తించారు. అతడి వద్ద నుంచి బంగారం స్వాధీనం చేసుకోగా, నగదు బెట్టింగ్‌లు, జల్సాలకు ఖర్చయినట్లు నిందితుడు తెలిపాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. కేసు విచారణలో కానిస్టేబుళ్లు సంజీవ్, అరవింద్, నర్సింహ గౌడ్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ అనిల్‌కుమార్

కారు బోల్తా : ఇద్దరికి గాయాలు

పెద్దశంకరంపేట(మెదక్): కారు అదుపుతప్పి బోల్తా పడటంతో ఇద్దరికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన మండలంలోని ఉత్తులూర్ వద్ద ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పల్లెగడ్డ గ్రామానికి చెందిన మహేశ్ కారులో ఉత్తులూర్ గ్రామంలోని బంధువుల ఇంటికి ఆదివారం వచ్చాడు. అదే గ్రామానికి చెందిన రాజుతో కలిసి పెద్దశంకరంపేట వైపు వస్తుండగా బ్రిడ్జి వద్ద వాహనం అదుపుతప్పి రోడ్డు కిందికి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను 108లో జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మద్యం మత్తులో వాహనం ప్రమాదానికి గురైనట్లు సమాచారం.

బైక్, కారు ఢీ : ఒకరికి తీవ్ర గాయాలు

అక్కన్నపేట(హుస్నాబాద్): బైక్, కారు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలోఒకరు గాయాల పాలయ్యారు. స్థానికుల కథనం మేరకు.. బొత్తెల పల్లె గ్రామానికి చెందిన గుగులోతు రమేశ్ బైక్‌పై హుస్నాబాద్ నుంచి బొత్తెల పల్లెకు వెళ్తున్నాడు. అక్కన్నపేట మీదుగా హుస్నాబాద్‌కు వస్తున్న కారు, ద్విచక్రవాహనం గొల్లకుంట గ్రామ సమీపంలోని కల్వర్టు వద్ద ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రమేశ్‌కు తీవ్ర గాయాలు కాగా 108 అంబులెన్స్ సాయంతో హుస్నాబాద్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

ఈజీఎస్‌లో రూ. 3.03 లక్షల రికవరీ!



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ఉన్నతాధికారులు

మిరుదొడ్డి(దుబ్బాక): ఈజీఎస్ పనుల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి పని చేయని కూలీలకు వేతనాలు చెల్లించారన్న ఆరోపణలు వెల్లువెత్తడంతో ఉపాధి హామీ సిబ్బంది నుంచి సుమారు రూ.3.03 లక్షలు రికవరీ చేయనున్నట్లు జిల్లా ఉన్నతాధికారులు తేల్చారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో సోమవారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 14వ సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉమ్మడి మండల పరిధిలో 20 గ్రామాల్లో 2003–24 సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనుల్లో రూ. 4.36 కోట్లు ఖర్చు చేసినట్లు తేల్చారు. అందులో రూ. 3.55 కోట్లు కూలీలకు చెల్లించగా మిగతా రూ. 45 లక్షలు ఉపాధి హామీలో కాంపోనెంట్ పరికరాల కొనుగోలుకు వినియోగించినట్లు నిర్ధారించారు. పథకంలో టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు నియమ నిబంధనలు పాటించకుండా ఇష్టారీతిగా అనుమతులు ఇస్తూ పని చేయని కూలీలకు చెల్లింపులు జరిగినట్లు తేలడంతో ఆయా ఉపాధి హామీ సిబ్బంది నుంచి రూ.3.03 లక్షలను తక్షణమే రికవరీ చేస్తామని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ బాలకృష్ణ, ఎస్ఆర్‌పీ గంగరాజు, ఏపీడీ శివాజీ, మిరుదొడ్డి, నిజాంపేట ఎంపీడీఓలు గంగుల గణేశ్ రెడ్డి, రాజిరెడ్డి, ఈజీఎస్ టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యం మెరుగుపర్చడమే లక్ష్యం



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న భాస్కర్

మద్దూరు(హుస్నాబాద్): విద్యార్థులలో అభ్యసన సామర్థ్యం మెరుగుపర్చడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ భాస్కర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంతో పాటు గాగ్గిళ్లాపూర్, నర్సాయపల్లి గ్రామాల్లోని పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్‌లను మండల విద్యాధికారి వరదరాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిలో అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించాలన్నారు. కంప్యూటర్ ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వేర్వేరు చోట్ల ఏడుగురు బలవన్మరణం

అనారోగ్య సమస్యలతో విద్యార్థి



సాయి (ఫైల్)

బెజ్జంకి(సిద్దిపేట): అనారోగ్య సమస్యలతో ఉరేసుకొని విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని నర్సింహులపల్లె గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ క్రిష్ణారెడ్డి కథనం మేరకు.. నర్సింహులపల్లె గ్రామానికి చెందిన కుసుంబ రవి పద్మలకు ఇద్దరు కుమారులు. వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. పెద్ద కుమారుడు సాయి(22) కరీంనగర్‌లోని ప్రైవేటు కాలేజీలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. నాలుగేళ్లుగా దగ్గు, దమ్ము, కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఆస్పత్రుల్లో చూయించుకున్నా నయం కాలేదు. దీంతో మనస్తాపం చెంది వ్యవసాయం పొలం వద్ద చెట్టుకు ఉరేసుకున్నాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న సాయిని సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆకారం గ్రామంలో రైతు



లక్ష్మయ్య(ఫైల్)

దుబ్బాకరూరల్: అనారోగ్య సమస్యలతో ఉరేసుకొని రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని ఆకారం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ గంగరాజ్ కథనం మేరకు.. దుద్దెడ లక్ష్మయ్య(52)గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆరు నెలలుగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఇటీవల పెద్ద ప్రేగుకు శస్త్రచికిత్స చేశారు. అప్పటి నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతూ తీవ్ర ఇబ్బందులకు గురయ్యాడు. దీంతో మనస్తాపానికి గురై తెల్లవారు జామున ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉరేసుకొని వ్యక్తి..



ఇమామ్ (ఫైల్)

చిలప్‌చెడ్(నర్సాపూర్): అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చిలప్‌చెడ్ మండలం చండూర్ గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. చండూర్ గ్రామానికి చెందిన దూదేకుల ఇమామ్ (38) హైదరాబాద్‌లోని హఫీజ్‌పేట్‌లో కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రెండేళ్ల కిందట కట్టిన ఇంటి నిర్మాణానికి అప్పులు కావడంతో మనస్తాపం చెందిన ఇమామ్ 15న హఫీజ్‌పేట్ నుంచి చండూర్ గ్రామానికి వచ్చాడు. 16న ఉదయం భార్య ఫాతిమాబేగం ఫోన్ చేసినా స్పందించకపోవడంతో బావ అయిన షాదుల్లాకు విషయం చెప్పింది. అతడు వెళ్లి చూసేసరికి ఇంట్లో ఇమామ్ ఉరేసుకొని కనిపించాడు. మృతుడి భార్య ఫాతిమా బేగం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అదనపు కట్నం వేధింపులకు వివాహిత



మహేశ్వరి(ఫైల్)

కంగ్టి(నారాయణఖేడ్): ఉరేసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కంగ్టి మండలం భీంరా గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని నాగన్‌పల్లి గ్రామానికి చెందిన పోగుల రవీందర్ రెడ్డి, సుజాత రెండవ కుమార్తె మహేశ్వరి(22)కి భీంరా గ్రామానికి చెందిన బోండ్ల పండరిరెడ్డితో 2022లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అత్తారింట్లో భర్త, మామ, బావ అదనపు కట్నం తేవాలని మహేశ్వరిని వేధించ సాగారు. ఈ విషయంలో గ్రామపెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించి సముదాయించారు. అయినా వేధింపులు ఆగకపోవడంతో సోమవారం తెల్లవారు జామున ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి రవీందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు భర్త బోండ్ల పండిరిరెడ్డి, బావ బసిరెడ్డి, మామ గంగారెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

చెరువులో దూకి యువకుడు

కంది(సంగారెడ్డి): చెరువులో దూకి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కంది మండలంలోని చిమ్నాపూర్ తండా లో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై రవీందర్ కథనం మేరకు.. చిమ్నాపూర్ తండాకు చెందిన భానోత్ అంబర్ సింగ్(25) ఆదివారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. తండాకు సమీపంలో ఉన్న ధర్మసాగర్ చెరువుకట్టపై అంబర్ సింగ్ చెప్పులు ఉన్నట్లు తండా వాసులు గుర్తించారు. పోలీసుల సహకారంతో చెరువులో ఆచూకీ కోసం గాలించగా అంబర్ సింగ్ మృతదేహం లభించింది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్పుల బాధతో ఇద్దరు రైతులు



పురుషోత్తం (ఫైల్)

రామాయంపేట(మెదక్): ఆర్థిక సమస్యలతో మండల పరిధిలోని ప్రగతి ధర్మారంలో ఒకరు, ఆర్. వెంకటాపూర్ గ్రామంలో మరొకరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్ఐ బాల్‌రాజ్ కథనం మేరకు.. ప్రగతి ధర్మారం గ్రామానికి చెందిన రైతు మాసాయిపేట పురుషోత్తం (34) కొంతకాలంగా అప్పుల బాధతో సతమతమవుతున్నాడు. ఆదివారం రాత్రి భోజనం చేసిన అనంతరం పొలానికి నీరు పెట్టి వస్తానని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బోరు వద్దకు వెళ్లి చూడగా చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. అప్పుల బాధతోనే భర్త ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య భాగ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మరో ఘటనలో ఆర్ వెంకటాపూర్ గ్రామానికి చెందిన రైతు పుర్ర రాములు (36) ఆర్థిక సమస్యలతో రెండు రోజుల కిందట ఇంటిలోనే క్రిమి సంహారక మందు తాగాడు. అతడిని చికిత్స నిమిత్తం రామాయంపేట నుంచి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా సోమవారం సాయంత్రం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వారాంతపు సంత వేలం వాయిదా

- రూ.కోటి దాటింది.. అంత డబ్బు చెల్లించలేమంటున్న కాంట్రాక్టర్లు

హుస్నాబాద్: వారాంతపు సంత వేలం రూ.కోటి దాటిపోయింది. అంత డబ్బు చెల్లించలేం. తగ్గిస్తేనే అంగడి నిర్వహణ చేపడుతామని పలువురు కాంట్రాక్టర్లు వేలం పాట పాడలేదు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం 2025–26 సంవత్సరానికి గాను మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ సంత బహిరంగ వేలం నిర్వహించారు. గతేడాది వార సంత రూ. కోటి 20 లక్షల 26 వేలకు పలికింది. ఈ సారి అదనంగా 5 శాతం కలిపి రూ.కోటి 26 లక్షల 27 వేల 300 నుంచి సర్కార్ పాటను ప్రారంభించారు. వేలం పాటలో 11 మంది పాల్గొనగా కాంట్రాక్టర్లు సిండికేట్ అయ్యి ఎవరూ పాడకుండా మిన్నకుండి పోయారు. అంగడిలో నెలకొన్న సౌకర్యాలకు ఒక్క రూపాయి ఖర్చు పెట్టడం లేదన్నారు. హుస్నాబాద్‌కు పక్కనున్న ప్రాంతాల్లో కొత్తగా అంగడీలు ఏర్పాటు చేశారన్నారు. వేలం పాటకు తగ్గట్లుగా రుసుం ఎక్కువ వసూలు చేయడంతో రైతులు, వ్యాపారులు పక్కనున్న అంగడీలకు వెళ్లడంతో ఆదాయం తగ్గి నష్టం వస్తుందని కాంట్రాక్టర్లు తెలిపారు. దీంతో వేలంను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. మున్సిపల్ ప్రత్యేక అధికారి, అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ దృష్టికి తీసుకెళ్లి త్వరలో రీ టెండర్ నిర్వహిస్తామని కమిషనర్ తెలిపారు.

అగ్ని ప్రమాదాలు.. కష్టం బూడిద పాలు

- ఒక్క రోజే నాలుగు ఘటనలు
- భారీస్థాయిలో ఆస్తి నష్టం
- లబోదిబోమంటున్న బాధితులు

కలప మిల్లులో షార్ట్ సర్క్యూట్

జహీరాబాద్ టౌన్: ఓ కలప మిల్లులో అగ్ని ప్రమాదం జరిగిన ఘటన జహీరాబాద్ పట్టణంలోని రాచన్నపేటలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. రాచన్నపేటలో గల గురుకృష సామిల్(కలప మిల్లు)లో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. తొలుత సామిల్‌కు మంటలు అంటుకొని ముందున్న మారుతీ కార్పెంట్ షాపునకు వ్యాపించాయి. విషయం తెలుసుకున్న స్థానికులు మాజీ కౌన్సిలర్ నామ రవికిరణ్, స్థానికులు మంటలార్పేందుకు ప్రయత్నించారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వచ్చి మంటలార్పివేశారు. ఈ ప్రమాదంలో కలపతోపాటు కార్పెంట్ దుకాణంలో ఉన్న మిషన్‌లు, బైక్ దగ్ధమైంది. సుమారు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. జహీరాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వంటగదిలో మంటలు

వెల్దుర్తి(తూప్రాన్) : అగ్ని ప్రమాదంలో వంటగది దగ్ధమైన ఘటన మండలంలోని ధర్మారం గ్రామంలో సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన మర్కంటి రుక్కమ్మకు చెందిన వంటగది ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని కాలి బూడిదయ్యింది. ప్రమాదంలో వంట సామగ్రి, బట్టలు, ఇతర నిత్యావసర సరుకులు కాలిపోయాయి. ఘటనా స్థలాన్ని గిర్దావర్ నర్సింగ్ యాదవ్ సందర్శించి పంచనామా నిర్వహించారు.అగ్నిప్రమాదంలో సుమారు రూ.25 వేల వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు.



మంటలార్పుతున్న స్థానికులు



వివరాలు తెలుసుకుంటున్న నర్సింగ్‌యాదవ్

కాలిబూడిదైన గడ్డివాము

శివ్వంపేట(నర్సాపూర్) : గడ్డివాము దగ్ధమైన ఘటన మండల పరిధి ఎదుల్లాపూర్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన బురెడ్డి అంజిరెడ్డి వ్యవసాయం పొలం వద్ద నిల్వ ఉంచిన ఎండు గడ్డివాముకు నిప్పంటుకుంది. సుమారు 800 గడ్డి మోపులు దగ్ధమయ్యాయి. నర్సాపూర్ నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలార్పినప్పటికీ పూర్తిగా తగులబడిపోయాయి. గుర్తు తెలియని వ్యక్తులు కావాలనే నిప్పు పెట్టినట్లు బాధిత రైతు అంజిరెడ్డి వాపోయారు. ఈ ప్రమాదంలో రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులు ఆదుకోవాలని కోరారు.

చెరకు తోట, డ్రిప్ పైపులు దగ్ధం



కాలిపోయిన చెరకు తోట

జహీరాబాద్ టౌన్: అగ్నిప్రమాదంలో చెరకు తోటతోపాటు డ్రిప్ పైపులు దగ్ధమయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రమైన మొగుడంపల్లి గ్రామ శివారులో సోమవారం చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. మండలంలోని భవానమ్మపల్లికి చెందిన రైతు గొల్ల రాచన్నకు మొగుడంపల్లి వద్ద 11 ఎకరాల చెరకు తోట ఉంది. పంటను ఇటీవలె కర్మాగారానికి సరఫరా చేయగా ప్రస్తుతం మొడెం తోట(రెండవ పంట) ఉంది. రోడ్డు పక్కన తోట ఉండటంతో గుర్తు తెలియని వ్యక్తులు సిగరేట్ తాగి పారవేయడంతో తోటకు నిప్పంటుకుంది. ఈ ప్రమాదంలో తోటతోపాటు డ్రిప్ పైపులు కాలిపోయాయి. సుమారు రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు.